# ముసుగు మనిషి

లలితాదేవి గర్భవతి అయిందనేమాట ఆనోటా ఆనోటా పాకి, చివ్వరికి ఆమె భర్తదాకాకూడా వెళ్ళింది. ఆమె భర్త నిరంజనరావు ముఖం ముకుళిత కుసుమం అయింది. అయితే మరు క్షణంలోనే కిలకిల నవ్వగల నేర్పుకూడా ఆయనలో ఉంది. అంత నిబ్బరం వుంది కాబట్టే, తన ఏభయవ ఏట, ముప్ఫయి అయిదేళ్ళ లలితాదేవిని పెళ్ళి చేసుకోగలిగాడు.

ఆయన పెద్ద ఆస్తిపరుడు. కాని సామాన్యంగా జీవించటం అల వాటు చేసుకున్నాడు. పదిమందిలో తిరిగి పేరుప్రతిష్ఠలు సంపాదించుకోవా లని ఎన్నడూ తాపత్రయ పడలేదు. నిజానికి అందరికీ ఎడంగా వుండా లని, ఒంటరిగానే జీవితం గడపాలని ఆయన ఉద్దేశం. అందుకనే బస్తీకి దూరంగా, చుట్టుప్రక్కల ఏ బాదరబందీలేని ప్రదేశంలో ఒక చిన్న మేడ కట్టుకుని ఉంటున్నాడు. అప్పటికి ఆ ప్రదేశానికి ఏ ప్రాముఖ్యము రాలేదు. ఇంకా ఊరు తయారు కాలేదుకూడా. పట్టుమని పదిళ్ళుకూడా లేవు. ఆ చోటులో యిళ్ళకు శంకుస్థాపన జరిగేముందు ఆ నేలను ఎకరాల్లో కొలిచే

వారు. వరినాటి, ధాన్యం రాసులు రాసులుగా యిళ్ళకు తీసుకువెళుతూ వుండే వాళ్ళు. కొన్నాళ్ళకు అదేనేలను, మీటర్లలో కొలిచారు. అప్పుడు పదిమంది పంచుకున్న భూమికి తర్వాత తర్వాత వందమంది యజమానులయ్యారు. అందులో నిరంజనరావు ఒకడు. నిశ్శబ్దంగా, ప్రశాంత వాతావరణంలో, హాయిగా, కాలం వెళ్ళబుచ్చొచ్చని, యిక్కడికి వచ్చేశాడు. చుట్టూ పొలాలు, మధ్యమధ్య పెంకుటిళ్ళు. వాటిల్లో ఒకేఒక మేడ. నిరంజనరావు చాలా సంతృప్తి పడ్డాడు. కాని ఆయన మనస్సులో బాధ అప్పుడప్పుడు కలుక్కుమంటూ ఉంటుంది. భార్య పోయిందనే వ్యథ కాదు. అది ఉండనే ఉంది. దాన్ని ఎవ్వరూ తీసెయ్యలేరు. ఆయనే నిబ్బరంగా గతాన్ని మరిచి పోతూ, మనస్సును మరల్చుకుంటూ ఉంటాడు. కాని సంతానం లేదనే ఆందోళన ఆయన మనస్సును గజిబిజి చేస్తూ ఉంటుంది. తీవ్రంగా ఆరాట పడతాడు. ఆవేదన పడతాడు. కాని తనకు తానుగా ఆంక్ష వేసుకున్నాడు. రెండో పెళ్ళి చేసుకోకూడదని. దానికి కేవలం తన భార్యమీద ఆయన కున్న అవ్యాజమైన ప్రేమే కారణం. తాను రెండో పెళ్ళి చేసుకుంటే, స్వర్గంలో ఉన్న భార్యకు మనశ్శాంతి ఉండదేమోనని భయపడుతూ ఉంటాడు.

ఆయన బాగుకోరి సలహాలిచ్చే స్నేహితులు, హితులు చాలా మంది ఉన్నారు. ఇంత ఆస్తికి వారసులు లేకపోవట మేమిటని, సంతానం లేకపోతే పున్నామనరకం అనుభవించవలసి వస్తుందని, ఏభై ఏళ్లు, పెద్ద వయస్సు కాదని, తగిన యువతి దొరకటం కష్టం కాదని అనేక రకాలుగా అభిప్రాయాలు వెళ్ళబుచ్చి, ఆయన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తూ వుండేవాళ్ళు. వాళ్ళ దాడికి తట్టుకోలేక వాళ్ళందర్నీ తప్పించుకుని ఎడంగా, ఎంతో దూరంగా మేడలో ఉంటున్నాడు. మనుష్యులవుతే కళ్ళకు కనిపించటం లేదుగాని, వాళ్ళు చెప్పిన మాటలు ప్రతినిత్యమూ ఆయన చెవుల్లో ప్రతి

ధ్వనిస్తూ ఉన్నాయి. గట్టిగా రెండు చేతుల్తోనూ చెవులు మూసుకున్నా ఆ ధ్వని గింగురు మంటూనే వుంది. కొన్నాళ్ళు మానసికంగా క్షోభపడ్డా, తర్వాత తర్వాత నిదానంగా, తాపీగా, ఆలోచించుకోవటం మొదలు పెట్టాడు. వాళ్ళ అన్న ముక్కల్లో సత్యం ఏదో ఉన్నట్లు ఆయన మనస్సుకు స్ఫురించింది. సత్యం ఏమిటో నిజానికి ఆయనకు తెలియక పోవచ్చు. ఆయన విశ్వాసానికి అనుగుణంగా కొన్ని మాటలు ఆయన మనస్సును పట్టేసినాయి. దాంతోనే ఒక నిశ్చయానికి వచ్చేశాడు. మళ్ళీ పెళ్ళిచేసుకోదలచు కున్నాడు, పున్నామ నరకంలోంచి తప్పించుకోవటానికి మానవ ప్రయత్నం చేయాలనుకున్నాడు.

అందువల్లనే లలికాదేవిని పెళ్ళిచేసుకున్నాడు. ఆమె మొహంలో గాంభీర్యం, ఆరిందాతనం, హుందాతనం, ఆయన్ను బాగా ఆకర్షించినాయి. ఆమె తన ఆకాంక్షకు ప్రత్యక్షస్వరూపం అని తన్మయం పొందాడు. పెళ్ళి చేసుకొన్న కొత్తరోజుల్లో, తన పిరికితనం, మొదటిభార్య రూపంలో కలలో కనిపించి, బెదరిస్తూ వుండేది. ఆయన విలవిలలాడి పోయేవాడు. తాను ఏదో తప్పు చేసినట్టు ఆమెకు క్షమాపణ చెప్పుకోవాలన్నట్టు భయ పడుతూ వుండేవాడు. వంశం నిలబెట్టటానికి, యింత ఆస్తికి వారసు డొకడు కావాలని, యీ రెండో పెళ్ళి తప్పనిసరిగా చేసుకోవాల్సి వచ్చిందని ప్రాధేయపడేవాడు. రెండో పెళ్ళి చేసుకునేముందు తాను రాబోయే భార్యపట్ల యేవిధంగా ప్రవర్తించాల్సింది నిర్ణయించుకున్నాడు. ఆమె కేవలం తన సహచారిణి. ఆమె స్వేచ్ఛకు యేవిధంగానూ అడ్డు రాకూడదు. ఆమె చెప్పి నట్లు తాను నడుచుకోవటంలో తప్పేమీ వుండదు. సంతానంకోసం చేసు కున్న వివాహంలో, తన వయస్సుకుపడ్డ భర్త బాధ్యత, విధి ఏమిటీ అని తనలోతాను గంటలతరబడి ఆలోచించుకుంటూ, విరుద్ధంగా వచ్చిన ఆలోచనలకు తనకు తానుగా సమాధానపడుతూ వుండేవాడు.

లలితాదేవి గడపలో కాలుపెట్టింది. నిరంజనరావు గుండె గుభేలు మన్నట్లయింది. దడ, ఆయాసం యెక్కువయింది. కారణం యేమిటో అర్థం కాలేదు. ఆయనకే ఆశ్చర్యం వేసింది. ఇదంతా తన ఊహేకాని నిజం కాదని సమాధానపడ్డాడు. కాని అయన ప్రశాంతతకు పూర్తి భగ్నం కలిగిందనుకున్నాడు. ఆయన భవనంచుట్టూ అనేక మంది ఇళ్ళు కట్టుకున్నారు. ఊరికి తూర్పుగా పెద్ద ఫ్యాక్టరీ నిర్మాణం అయిపోయింది. అనేక మంది కార్మికులకు ఆసరా అయిపోయింది. బస్తీని కలుపుతూ సూటిగా రోడ్డుకూడా వేశారు. రోజుకు రెండుసార్లు బస్సులు వస్తూ వుంటాయి. మట్టిరోడ్డు అవటంవలన, బస్సు వచ్చినప్పుడల్లా యింతెత్తు దుమ్ము లేచి, గాలితోపాటు తన మేడ రెండో అంతస్థులోవున్న గదిలోకి వస్తూ వుంటుంది. ఆ కాసేపు ఆయనకు ఉక్కిరి బిక్కిరయినట్లుంటుంది. ప్రభుత్వంవారు ఆ ఊరికి అనేక సదుపాయాలు కలిగించాలనే ఆదుర్దాలో గోతులు తవ్వి వుంచారు - ఎలక్ట్రిక్ స్తంభాలు, టెలిఫోన్ స్తంభాలు పాతటానికి ముందుచేసిన ఏర్పాట్లు. మట్టిరోడ్డును కంకరతో కప్పెయ్యాలని, రోడ్డుకు రెండువైపులా కంకరరాళ్ళు పోసివుంచారు. జనాభా ఎక్కువయిపోయింది. చిన్న చిన్న హోటళ్ళు, ఆసుపత్రులు, సమితిస్కూళ్ళు అన్నీ ఒక్కొక్కటే ఏర్పడ్డాయి. నిరంజనరావు తాపీగా తన గదిలో కూర్చుని, తన కళ్ళముందు జరిగిన, జరగపోతున్న మార్పులను గురించి, చిత్రంగా ఆలోచించుకుంటూ వుంటాడు. బస్తీ కళలన్నీ ఆ ఊరికి మెల్లి మెల్లిగా వస్తున్నాయి. అట్టే పరికిస్తూ ప్రశాంత వాతావరణమంతా చెడిపోయిందే అని బాధపడుతూ వుంటాడు. లలితాదేవిని చేపట్టి నాలుగేళ్ళయ్యేటప్పటికి, ఇంట్లోనూ, వంట్లోనూ, ఊళ్ళోనూ పూర్తి మార్పులు వచ్చేసినాయి. రెండోపెళ్ళి చేసుకోబోయేముందు తనకున్న భావాలకు, లలితాదేవి కాపరానికి వచ్చిన తర్వాత కలిగిన అభిప్రాయాలకు ఎక్కడా పొత్తు

కుదరటం లేదు. తనకూ తనభార్యకూ మధ్యవున్న దూరాన్ని పూర్తిగా తెలుసుకోగలిగాడు. తాను రెండోపెళ్ళి చేసుకోవటం పెద్ద పొరపాటేమో నని పశ్చాత్తాపపడుతున్నాడు. అయితే, పరిస్థితులను పూర్తిగా అవగాహనం చేసుకుని, ఉన్నవి ఉన్నట్టుగా ఆలోచించే సహనశక్తికూడా ఆయనకు వుంది. అందువల్లనే, తల్లి కాబోతున్న లలితాదేవిని అభినందించటానికి నిరంజనరావు పూర్తిగా సిద్ధపడ్డాడు. ఇదే లలితాదేవి అదృష్టం.

నిజానికి లలితాదేవి మనస్సు నిర్మలమైనది. శారీరక దౌర్బల్యాలకు దాసురాలు కాకండా నిగ్రహశక్తి అలవరచుకుంది. తన అందాన్ని యితరుల ఆనందానికి బలిచెయ్యడానికి ఎన్నడూ సిద్ధపడలేదు. ఎన్ని అవకాశాలు, ఆకర్షణలు వచ్చినా తోసిపుచ్చింది. తన భర్తపట్ల తనకున్న గౌరవాన్ని అభిమానాన్ని, నలుగురూ పొగడేటట్లుగానే వ్యక్తపరుస్తూ వచ్చింది. ఈ అన్యోన్య దాంపత్యంపట్ల వెలిబుచ్చుతున్న పొగడ్తలకు నిరంజనరావు మౌనంగా, తన కృతజ్ఞతను తెలియచేశాడు. వ్యక్తత వచ్చిన వ్యక్తులు మాదిరిగానే. భార్యాభర్త లిద్దరూ ఒకర్నొకరు అభిమానిస్తూ గౌరవిస్తూ సంసారం సాగించాలని ఆయనకూడా అంటూవుంటాడు. భార్యకు యిచ్చిన యీగౌరవాన్ని కొంతమంది అపార్థం చేసుకుని, ఆడదానికి యింత విచ్చలవిడి పనికిరాదని వ్యాఖ్యానించారు. ఈ విషయం లలితా దేవికి తెలుసు. కాని ఆమె బాధపడలేదు. ఆమెకు తన హద్దు లేమిటో తెలుసు. ఆమె ఔదార్యం వలన, యితరుల అప్యాయతను, అభిమానాన్ని పొందగలిగింది. ఆమె వ్యక్తిత్వం యెన్నో యింతలు పెరిగిపోయింది. ఆమె చదువుకున్న వనిత. సంస్కారం గల యువతి. ఆమె భర్తగా, నిరంజనరావుకు కూడా ఎంతో గౌరవం లభించింది. భర్త మనస్సు ఆమెకు పూర్తిగా తెలుసు భర్తకోరికలను, తాను యీ జన్మలో నెరవేర్చగలనా అని ఆరాటపడుతూ వుండేది. భార్యా భర్తలిద్దరు ఆ ఊరి ప్రజలకేగాక, చుట్టు ప్రక్కల

గ్రామాదుల్లోని జనానికి కూడా శాయశక్తులా సహాయం చేస్తూనే వుంటారు. వారికి సంతానం కలుగ లేదని, భగవంతుడు చిన్న చూపు చూశాడని, అంటూ వుంటారు కొంత మంది. ఆమెతో కూడా యీ ముక్కే అన్నారు. ఆమె కూడా నొచ్చుకొనేది. దైవకృప ఎన్నడు కలుగు తుందో అని వైరాగ్యంగా అంటూ వుండేది. తనకు పిల్లలు కలుగలేదనే బాధ, ఆమెను నిత్యమూ వేధిస్తూ వుండేది. ఈ వేదనే ఆమెకు భక్తిభావాన్ని ప్రబోధించింది. అన్నింటికీ దేవుడే బాధ్యుడు అనే విశ్వాసానికి వచ్చేసింది. ఆమె భక్తిశ్రద్ధలకు దేవుడు కరుణించాడని, ఆమె అచంచల విశ్వాసం. ప్రజల నమ్మకంకూడా అదే. అందుకనే లలితా దేవి గర్భవతి అయిందనే మాట విని, చాలా మంది గ్రామ ప్రజలు దేవుడికి చేసిన మొక్కులు చెల్లించుకున్నారు. కాని, నిరంజనరావు ఆమాట విన్నప్పుడు గతుక్కుమన్నాడు. ఒళ్ళు ఝుల్లుమంది. పరిస్థితిని గమనించాడు. వాతావరణాన్ని చూశాడు. ప్రజల విశ్వాసానికి ఎదురు చెప్పలేనని గ్రహించుకున్నాడు. తనకున్న వ్యక్తిగత అభిప్రాయాలకు స్వస్తి చెప్పాడు. మనోవేదనను, ఆరాటాన్ని తగ్గించు కోవటానికి తీవ్ర ప్రయత్నం చేశాడు. గురుస్వాముల వారిని పూజించటానికి అనేక మంది వెళుతుంటే, ఎంతోదూరంగా నిలబడి, నిరంజనరావు తన నిరసనను, అసంతృప్తిని మౌనంగా వెల్లడించుకొన్నాడు.

లలితా దేవిలో కలిగిన దైవభక్తి ప్రేరణను గురుస్వామి పూర్తిగా అర్థం చేసుకుని, ఆమెకు సంపూర్ణ విశ్వాసాన్ని కలుగ జేశాడు. ఆమె గురుస్వామిని ప్రత్యక్ష దైవంగా స్వీకరించ గలిగింది. మానవ మాత్రునిలో అంత గుడ్డి నమ్మకం వుంచకూడదని నిరంజనరావు వాదం. కాని అయన వాదం వీగిపోయింది. ఒక్క లలితాదేవి పట్టుదల వల్లనే కాదు, అందరి అభిమానం ఆ గురుస్వామి మీద కేంద్రీకరింప బడివుంది. దాన్ని కదిలించటానికి ఎవ్వరి తరమూకాదు. ప్రజాభిప్రాయం అంత తీవ్రంగానూ

బలంగానూ వుంది. నిరంజనరావు ఒంటరివాడు. తాను ఏమీ చెయ్యలేడు. తన అనుమానం నిజమేనని రూఢిగా అనుకున్నాడు. తనభార్య శీలం శంకించటం వలన సమస్య పరిష్కారం కాదు. ఆ విషయమే నలుగురి తోనూ చెప్పటం వలన, తన మీద గౌరవం పెరగదు నలుగుర్లోనూ అవ మానం, అపనింద తప్ప యింకేమీ వుండవు. అలాంటి పరిస్థితుల్లో మెదల కండా వూరుకోవటమే ఉత్తమ మార్గమని నిర్ణయించుకున్నాడు. నలుగురి తోపాటు తానూ భగవంతుడ్ని ప్రార్థించుకున్నాడు. మూఢ విశ్వాసాలకు ఎప్పుడయినా ముక్తి వుంటుందా అని తల్లడిల్లి పోయాడు. లలితా దేవి అయితే పూర్తిగా తన విశ్వాసంలో మునిగి వుంది. భర్త పాదాలకు నమ స్కారం చెయ్యటానికి వచ్చిన లలితాదేవిని ఆప్యాయంగా, ఆదరంగా దగ్గ రకు తీసుకున్నాడు. ఆమె అమాయకత్వానికి అయన నిర్విణ్ణు డయి పోయాడు.

## 2

అప్పటి కింకా ఊరు ఏర్పడలేదు. పట్టు మని పదిళ్ళుకూడా లేవు. ఆ యిళ్ళల్లో నిరంజనరావు గారి మేడ అందరికీ కొట్టొచ్చినట్టు కన్పిపిస్తూ వుంటుంది. ఆయన వుదారంగా, ప్రజల అవసరాలు తీర్చటానికి తోడ్పడ తాడని నాలుగుచోట్ల ప్రాకిపోయింది. తీర్థ ప్రజలాగ ఆయనింటికి నిత్యమూ అనేక మంది వస్తూవుంటారు. సంసారం మీద విరక్తి పుట్టి, దేశం మీదికి బయలు దేరిన గురుమూర్తి, రామబ్రహ్మం హఠాత్తుగా ఇక్కడికే విచ్చేశారు. అటూ యిటూ చూశారు. ఇది కొత్త ప్రదేశం. కొత్తోవింత. ఇక్కడ తిష్ఠవేస్తే భుక్తికి లోపం వుండదని, నలుగు రికీ ముక్తి ప్రసాదించొచ్చని గట్టిగా ఆలోచన చేశారు. ఎన్నిచోట్ల తిరి గినా యింత అనువైన ప్రదేశం వాళ్ళకు దొరకనే దొరకలేదు. తాడి తోపుల్లో చిన్నచోపాను నిర్మించు కున్నారు. వాళ్ళిద్దరికీ అదే భవనం.

ఇద్దర్లూ తీవ్రంగా చర్చించుకున్నారు. ప్రజలకు దేని మీద అచంచల విశ్వాసం కాస్తో కూస్తో, యీ నాటి వరకూ వుందీ అనే ప్రశ్నకు యిద్దర్లూ భగవంతుని మీదే సమాధానం చెప్పుకున్నారు. విశ్వాసానికి మించినది మరొకటి లేదు. ఇప్పుడిప్పుడే కొత్తగాయిళ్ళు యేర్పడుతున్నాయి. ముందు ముందు యీ ప్రదేశానికి అత్యంతప్రాముఖ్యం వచ్చే సూచనలు కనబడు తున్నాయి. ఓపికతో సహనం వహించి యిక్కడే అంటి పెట్టుకుంటే, ఇటు ఇహానికి, అటు పరానికి ఏలోటూ లేకుండా పోతుందని నిశ్చయించుకున్నారు. తమ ఉనికికి చలనం లేకుండా కావలసిన ఏర్పాట్లను గురించి ఆలోచించుకున్నారు. కొత్త కొత్త కట్టడాలు వస్తున్నాయి. ఈ ఇళ్ళకు చాలా దగ్గరగానే ప్రభుత్వం వారు పెద్ద ఫ్యాక్టరీ ఒకటి కట్టబోతున్నారు. దీని వలన జనాభా ముందు ముందు యెక్కువగా వుంటుంది. జనం పెరిగిన కొద్దీ విశ్వాసాన్ని పెరుగు తుంది. ముందరగా కొద్దిమంది ప్రజల్లోనూ తగినంత భక్తిని విశ్వాసాన్ని ప్రవేశ పెట్టాలి. తర్వాత యీ ప్రజలే కావలసినంత ప్రచారం చేస్తారు.ఇదంతా ఆలోచించే గురుమూర్తి కాస్త, గురుస్వామిగానూ, రామబ్రహ్మం - వట్టి బ్రహ్మంగానూ మారి పోయారు. గురుమూర్తి వయసులో పెద్దవాడు అవటంవలనను, గురువుగా వుంటే ఏమేమి బాధ్యతలు పైన పడతాయో అనే భయంతోనూ, బ్రహ్మం గురుస్వామిని, గురువుగా స్వీకరించాడు. అప్పటి నుంచీ బ్రహ్మం శిష్యుడయ్యాడన్న మాట. రక్తిపోయి విరక్తి వచ్చేటప్పటికి, కమండలం, చేతికర్ర కూడా వచ్చేసినాయి, గురుస్వామి నుదుటిమీద, జానెడు వెడల్పున మూడు విభూతి రేఖలు దట్టంగా కనిపిస్తున్నాయి. బ్రహ్మం ఫాలభాగంమీదకూడా అలాంటి రేఖలే మెరుస్తున్నాయి. తాను కష్టపడి సంపాదించిన విజ్ఞానపు మూటను గురుస్వామి అప్పుడప్పుడు విప్పి 'నీ కడుపు నిండేంతవరకు నింపుకో' మంటాడు బ్రహ్మాన్ని, పాపం బ్రహ్మం అల్పసంతోషి. అతను కాస్తదాంతోనే సంతృప్తి పడుతూ వుండేవాడు. వారిద్దరు విరక్తిని

మనసారా ఆహ్వానించారు. ఐహిక సుఖాలమీదనుంచి మనస్సును మరల్చుకోవటం అలవాటు చేసుకోమని శిష్యునికి యెంత బోధించినా ప్రయోజనం కనిపించటం లేదు. బ్రహ్మనికి నూరిపోసిన వేదాంతం అంతా వృథా అయిపోతోంది. అతనికి ఎక్కువ ఆకళింపులేదు. అరుగుదల అంతకంటె తక్కువ. జిహ్వ యింకా రుచులు కని పెడుతోంది. 'మనము కష్టాలను ఓర్చుకోవటం నేర్చుకున్నామంటే, ముందు ముందు ఎన్నైనా సాధించకలుగుతాము'అని గురుస్వామి చెప్పిన సూక్తిని, బ్రహ్మం పాటించలేకపోతున్నాడు. ఇద్దరికీ ఘర్షణ బాగా పెరిగిపోతోంది. ప్రజల్లో విశ్వాసం కలిగించేటంత వరకు, మనము యెంతో నిబ్బరంగానూ, గంభీరంగానూ ప్రవర్తించాలని, ఎన్నిసార్లు చెప్పినా, బ్రహ్మనికి అర్థం కావటం లేదు. కాలం ఒరవడికి, గురుస్వామికూడా అలసిపోతున్నాడు. చాలామంది ప్రజలు, వీరిద్దర్నీ చూసి భక్తితో నమస్కారం చెయ్యటం దాకా వచ్చింది.కాని దానివలన ప్రయోజనం యేమీ కనిపించటం లేదు. సంసారంలోకంటే, యిక్కడే యిబ్బందులు యెక్కువయినాయే అనే భావన యిద్దరికీ కలిగేదాక సహనం వహించారు. ఇంకా కొద్ది రోజులు అదేరీతిగా బ్రతుకులు నడవాలంటే కష్టంగానే వున్నది. హఠాత్తుగా వాళ్ళ జీవితాల్లో తొలిమలుపు ప్రవేశించింది.

అనాడు కూలీలు హోరా హోరీగా భూ మాతతో పోట్లాడుతున్నారు, పలుగులతో పొడుస్తున్నారు, పారలతో చెక్కుతున్నారు. మందుగుండు సామానుతో పేలుస్తున్నారు. కాని భూమాత చలించలేదు. మీరింత హింస పెడుతున్నారు కాబట్టి, ఒక్క నీటిబిందువు కూడా మీకివ్వను అన్నట్టు ముభావంగా వుండి పోయింది. అంతా నిరుత్సాహపడిపోయారు. అప్పుడే గురుస్వామి కమండలం తీసుకుని బయలుదేరి వస్తున్నాడు. వెనకాలే బ్రహ్మం భక్తిశ్రద్ధలతో వదిగి వదిగి నడుస్తున్నాడు. వారిద్దరి కళ్ళు యిటువైపుకే మళ్ళినాయి. గురుస్వామి చప్పున ఆగాడు, అక్కడ ఏమిటని ప్రశ్నించినట్లు,

వాళ్ళ మొహాల్లోకి చూశాడు. వాళ్ళు విషయం చెప్పారు. గురుస్వామి అందరికీ అభయమిచ్చాడు. బ్రహ్మం సంతోషంతో తెల్లమొహం వేశాడు! ఆయన మెల్లిగా ఒక గోతిలోకిదిగి, భూసార పరిశోధనలో తాను నేర్చుకున్న మొదటి పాఠాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. జలయెక్కడుంటుందో గురికి బెత్తెడు యెడంలో కనిపెట్టాడు. తనంతటతానుగా ప్రయత్నంచేసి, ఒక్కసారిగా నీటిని విరజిమ్మేశాడు. అందరూ చప్పట్లు కొట్టారు. చేతులు జోడించారు. ఆయన మహిమవలనే నీరు పడిందని ఏకగ్రీవంగా అక్కడ చేరిన కొద్దిమంది వయోజనులు వొప్పుకున్నారు. అప్పటినుంచే గురుస్వామి మీద గురి కుదిరింది. బ్రహ్మంకూడా తబ్బిబ్బయి పోయాడు. ఇక ఫరవా లేదనుకున్నారు యిద్దరూను. ప్రజలు తండోపతండాలుగా వచ్చి, గురు శిష్యు లిద్దర్నీ దర్శించిపోతున్నారు. ఇద్దరూకూడా నిబ్బరంగా, వచ్చిన భక్తులను ఆశీర్వదించి ఫలాపేక్ష లేకుండా కొన్నాళ్లు గడిపారు. అప్పటి కప్పుడే కొత్తయిళ్లు వెలిసినాయి. కొత్తమనుషులు వచ్చారు. భక్తిభావం లేనివాళ్ళుకూడా స్వాములవారి మహిమేమిటో చూద్దామని, యీాయన బసకు వచ్చి తొంగిచూసి పోతున్నారు. రద్దీ యెక్కువయ్యేటప్పటికి, గురుస్వామి బాధ్యత పెరిగిపోతోంది. బ్రహ్మం ఉక్కిరి బిక్కిరయి పోతున్నాడు. ప్రజల్లో రకరకాల ప్రవృత్తులవారు వుంటారు. అందిరికీ ఒకే విశ్వాసం వుండదు. ఎవరికి తగినట్టు వారికి నచ్చచెప్పి పంపాలి అని శిష్యునికి బోధచేస్తూ వుంటాడు. బ్రహ్మం అన్నీ విని వూరుకుంటాడు గాని, తనకు తానుగా యేమీ చెయ్యలేక పోతున్నాడు. గురుస్వామి మాటలను తప్పకుండా పాటించగల ధైర్యమూ లేదు. ఈ మధ్యలో నలిబిలయి పోతున్నాడు. ఇద్దరూ రాత్రిళ్ళు, అందరూ నిద్రపోయేవేళ, ఇంట్లో కూర్చుని తీవ్రంగా ఘర్షణపడటం, ఒకరినొకరు నిందించుకోవటం పరిపాటయి పోయింది. తెలతెలవారుతూ వుండగా ఊరికి ఉత్తరంగా వున్న

చెరువుకు వెళ్లి, బిందెతో నీళ్ళు తీసుకురావటం, గురుస్వామి పాదపూజ చేయటం, అన్నం వండటం తప్పని సరిగా బ్రహ్మం చేస్తూనే వున్నాడు. కాని అతనికి సంతృప్తి లేకుండా వుంది. చాకిరీ యెక్కువయింది. గౌరవ మర్యాద లేమో గురుస్వామికి లభిస్తున్నాయి. కాని చేసేదేమీ కనిపించటం లేదు. ఆ ఊరి ప్రజలకే గాక అక్కడికి వచ్చే భక్తులకు; బ్రహ్మం, గురుస్వామి శిష్యుడుగా పరిచయ మయిపోయాడు. ఇంక ఆ ముద్ర చెరిగిపోయే ఆస్కారం లేదు. అంత కంటె ప్రతిష్ఠ వచ్చేటట్టు లేదు. డబ్బుకూడా అంతంత మాత్రంగానే వస్తోంది.

గురుస్వామికికూడా అసంతృప్తిగానే వుంది. ఇంకా ప్రజలను ఆకర్షించాలని, దాని కోసం కొన్ని మహిమలు చేయాల్సి వస్తుందని బ్రహ్మనికి నచ్చచెప్పాడు. వేరే గత్యంతరంలేక సరే అన్నాడు. వారానికి ఒక రోజు పొరుగూరు వెళ్ళి, స్వాములవారి మహత్తు అక్కడ ప్రచారం చేసివస్తూ వుంటాడు. దార్లో చెయ్యరానిపనులు అనేకం చేస్తూ, డబ్బు సంపాదించటం, ఇతరుల డబ్బును ఏదో మిష పెట్టి, సునాయాసంగా కైంకర్యం చేయటం, ఆశలుచూపెట్టి మనుష్యుల విశ్వాసాన్ని బలపరచటం లాంటివి యెన్నో చేస్తున్నాడు. ఆశలు తీరినవారికి గురుస్వామిమీద భక్తి కుదిరింది. ఆశలు తీరనివారు, తమ దురదృష్టమని, సమాధాన పడుతున్నారు. వాళ్ళబస ఒక చిన్న పెంకుటిల్లుగా మారింది. దొడ్డివైపు గదిలో గురుస్వామి నిష్ఠగా కూర్చుని ధ్యానంలో వుంటాడు. బ్రహ్మం వాకిటిగదిలో కాపలాగా కూర్చుని వచ్చేపోయేవాళ్ళను ఓ కంటితో కనిపెట్టుతూ వుంటాడు.

బ్రహ్మం అప్పుడప్పుడు అర్థరాత్రి హఠాత్తుగా లేచి పెద్ద పెద్ద కేకలు పెడుతూ వుంటాడు. 'నేను చెయ్యలేదు,' 'నేను చెయ్యలేదు'అంటూ. మొదట్లో గురుస్వామికే అర్థంకాలేదు, యీ కేకల ఆంతర్యం ఏమిటో.

తర్వాత తర్వాత ఆయనకూ తెలిసింది, పగలుచేసిన అత్యాచారాలను, రాత్రి కలలో చెయ్యలేదు,చెయ్యలేదు అనటం పరిపాటయి పోయింది. బ్రహ్మం మనస్సు కలవరపడుతోంది. అసలు దేశంమీదికి బయలుదేరింది యింట్లో బాధలు పడలేక, అవకాశంవస్తే డబ్బు కూడగట్టుకు పోదామని. కాని జరగుతున్నది యింకోతీరు. ఈబాధలు చూస్తుంటే యిల్లే నయ మనిపిస్తూ వుంటుంది, ఒకొక్కప్పుడు. అయితే క్రమ క్రమంగా యీ జీవితంమీద ఆకర్షణ యెక్కువయ్యేటప్పటికి యింటిమాట మరచిపోవటం జరుగుతోంది. అప్పటికప్పుడే, గురుస్వామి ప్రభావం ఊరూర పాకిపోయింది. దానికి కారణం, బాధ్యత పూర్తిగా బ్రహ్మందే. పిల్లలులేనివాళ్ళకు పిల్లలు కలగటం, ముందు జరగబోయే విషయాలు పొల్లులేకుండా చెప్పటం, యీ రెంటిలోనూ చాలామందికి బాగాగురి కుదిరింది. ఈ ఆకర్షణే లలితాదేవిని ఆకట్టేసింది. తర్కానికి అందనిది యేదోవుంటుందని, ఆ శక్తిని మనం శంకించ రాదని భర్తతో అంటే, నిరంజనరావు యేమి మాట్లాడలేదు. ఆయనకు మానవాతీతమైన శక్తి ఒకటుందని నమ్మకం వున్నప్పటికీ, యీ గురుస్వామిలాంటి వారిమీద మాత్రం విశ్వాసం యేమాత్రంలేదు. పైగా అపనమ్మకం కూడా వుంది. అలాంటివాళ్ళు చాలా ప్రమాదకరమనికూడా ఆయన విశ్వాసం. కాని భర్త నమ్మకానికి కట్టుబడి వుండేది కాదు లలితా దేవి. ఆ విషయంకూడా ఆయనకు తెలుసు. తాను మాతృమూర్తి కావాలనే ఆవేదనలో, యింకో విషయం ఆలోచించాలని ఆమెకు తోచలేదు. అంత కంటె భగవంతునిమీద ఆమెకున్న అచంచల విశ్వాసమే, గురుస్వామి దగ్గరకు తీసుకువెళ్ళింది. కాని మొదట్లో, బ్రహ్మం అడ్డగించాడు. తన గురువుగారిని చూడటానికి ఆడవాళ్ళురాకూడదని వారించాడు. కాని లలితా దేవివంటి స్త్రీ అక్కడికి రావటమే మహాభాగ్యమని అక్కడి వాళ్ళంతా బ్రహ్మానికి నచ్చచెప్పారు. అయన లోపలికివెళ్ళి గురువుగారి అనుమతి

తీసుకుని, మరీ లలితాదేవికి అనుమతి ఇచ్చాడు. లలితాదేవి ఎంత గొప్ప వ్యక్తి అయినా, అక్కడికి వెళ్ళేటప్పటికి, తన హద్దులేమిటో తెలుసుకుంది. అందరి మాదిరిగానే ఆమెకూడ, గురుస్వామి దర్శనంకోసం వేచి వుండాల్సి వచ్చింది. కాని చూసేవాళ్ళకు మాత్రం ఎబ్బెట్టుగా వుంది ఇది. ఆయన ముందు అందరూ సమానమే అనే సత్యాన్ని చాటటానికి చేసిన తతంగం అని బ్రహ్మానికి మాత్రం తెలుసు.

మొట్టమొదటి రోజునే, ఆమె గురుస్వామిని ఆకర్షించ కలిగింది. తనకు విశ్వాసం కలిగింది. ఆయనను సేవిస్తే, తనకోరిక తీరగలదని గాఢంగా నమ్మింది. లలితాదేవి మేడకు, యీయనగారి బస సరిగ్గా అరకిలోమీటరుదూరంగా వుంటుంది. ఆమె నిత్యమూ ఉదయం ఏడవుతూ వుండగా, కాలినడకన, గురుస్వామి యింటికి వెళ్ళి ఆయన ఆశీర్వాదంపొంది వస్తూ వుంటుంది. ఆమె ఠీవిగా వెళుతూవుంటే, ఆ సమయానికి అనేకమంది బారులుతీర్చి నిలబడి అదేపనిగా చూస్తూ వుంటారు. ఆమెభక్తి విశ్వాసాలకు చాలామంది ఆశ్చర్యపడిపోయారు. అంతటివ్యక్తే ఆకర్షింపబడితే, నిజంగా గురుస్వామితో యేదో మహత్తు వున్నమాట వాస్తవమే అని, నలుగురూ వొప్పుకుంటున్నారు. ఆయన ప్రభ యింకా ప్రజ్వలంగా వుంది. కాని ఆమె సంతానం కావాలనికోరి వచ్చింది. గురుస్వామి ఆశీర్వాదబలం అవుతే బాగానే వుంది. కాని బ్రహ్మానికే నమ్మకం కుదరటంలేదు. హడలి పోతున్నాడు. తాను యింకా యే రకమైన పాపాన్ని చేయాల్సి వస్తుందో అని భయపడుతున్నాడు. లలితాదేవి కొంచెందూరంలో వుండగానే బ్రహ్మం మూగవాడయి పోతాడు. బిత్తరపోయి చూస్తూ నిల బడి వుంటాడు. ఆమె యిక్కడికి వస్తున్నప్పటి నుంచి, యెన్నో సదుపాయాలు కలుగు తున్నాయి. ప్రతి నిత్యమూ యేదోమార్పు జరుగు తూనే వుంది. గురుస్వామి పూజకోసం ప్రత్యేకంగా ఒకగది కట్టిం

చింది. విశాలమైన రెండుహాలులు యేర్పాటయినాయి. ఒక్కసారిగా పది మంది కూర్చుని గోష్ఠి జరపటానికి అనువయిన ఏర్పాట్లన్నీ చేసింది. లలితా దేవిగారు తలచుకుంటే యిది కూడా ఒక పెద్ద భవనంగా మార్చెయ్యలేక పోయేవారా? అని అందరూ అనుకున్నారు. క్రమ క్రమంగా లలితాదేవి, ఉదయమే కాకండా సాయంత్రంపూటకూడా గురుస్వామి దర్శనానికి వెళ్ళటం అలవాటు చేసుకుంది. నిరంజనరావుకయితే తనభార్య ఆవిధంగా పగలు, రాత్రి అక్కడికి వెళ్ళటం యిష్టం వుండేది కాదు. తన అయిష్టతను ఆమెకు చెప్పటం వరకే తన భాధ్యత. తర్వాత అమె యిష్టం.

ఆనాడు చీకటి దట్టంగా అలుముకునివుంది. ఊరంతా దీపాలు మిణుకుమిణుకు మంటున్నాయి. కీచురాళ్ళధ్వని తీవ్రంగా వుంది. నిరంజనరావు. తనమేడగదిలో కూర్చుని, గురుస్వామి ఆశ్రమాన్ని కళ్ళు విప్పి మరీ చూస్తున్నాడు. అక్కడా దీపాలు బాగానే వెలుగుతున్నాయి. వచ్చేజనం పోయేజనం కిటకిటలాడుతూవుంది. అస్పష్టంగా మనుషులు కనబడుతున్నారు. అందులో ఆయన భార్య లలితాదేవికూడా వుండి వుంటుందని ఆయనకు తెలుసు. రోజూ ఆ సమయానికి యింటికి వచ్చే లలితాదేవి ఆనాడు రాలేదు. ఇంతసేపయిందేమా అని ఆరాటపడుతున్నాడు. చప్పున గదిలోంచి బైటకు వచ్చి చూస్తున్నాడు, మళ్ళీ లోపలికి వెళ్ళి, కిటికీలోంచి, ఆ గురుస్వామి ఆశ్రమంవైపు చూస్తున్నాడు. మనస్సులో అవేదనగా వుంది. పైకి విప్పి చెప్పలేని మానసిక క్షోభపడుతున్నాడు. ఇంతలోకి 'అయ్యగారు' అని వణుక్కుంటూ ఒకలాంతరు పట్టుకుని నౌకరువచ్చి నిలబడ్డాడు. 'అమ్మగారు యీ రేత్రికి అక్కడే వుంటారుట. మీతో చెప్పమన్నారు' అని కబురుతెచ్చాడు. నిరంజనరావుకు భగ్గునమండింది. 'హద్దు లేకుండా పోయింది. అడింది ఆట పాడిందిపాటగావుంది. ఇక్కడ తాను వున్నాననికూడా లెక్కచేయకండా యిష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తోంది ఆను

కుంటూ మనస్సులోనే ఏవో సణుక్కున్నాడు. గబగబ క్రిందకు దిగి వచ్చి, అటువైపే వెళుతున్నట్లుగా ఆదుర్దా కనబరిచాడు. మళ్ళీ మరు క్షణంలోనే తమాయించుకొని, తనకోపాన్నంతా చల్లార్చుకున్నాడు. బరువుగా, చేతికర్రను నేలమీద కొట్టుతూ, మళ్ళీమెట్లెక్కి గదిలోకి వెళ్ళి పడుకున్నాడు. ఎంతసేపటికి నిద్రపట్టటం లేదు. మాటి మాటికిలేచి కిటికీలోంచి చూస్తున్నాడు. అక్కసుపడుతున్నాడు. మనశ్శాంతి లేకుండా పోయింది. మర్నాడు ఉదయమే,లలితాదేవి లేచి చక్కావచ్చింది. ఆమె మొహాన్ని చూడగానే, నిరంజనరావు నిశ్చేష్టుడయి నిలబడిపోయాడు. నోట మాటరాలేదు.ఆమె సిగ్గుతో భిడియపడుతూ వున్నట్లు గబగబా లోపలికి వెళ్ళిపోయింది. ఆమె వాలకాన్ని చూస్తుంటే నిరంజనరావుకు భయంవేసింది. ఆమె మొహంలో గాంభీర్యం తీక్షణత ఆయన్ను వెక్కిరిస్తున్నట్లున్నాయి. ఆత్మాభిమానం బాగా దెబ్బతిన్నది. తనకేదో తలవంపులయినట్లు తీవ్రంగా బాధపడుతున్నాడు. ఇంక నలుగురిలోనూ తలెత్తుకుని తిరిగే యోగ్యత లేదని ఆరాట పడుతున్నాడు. ఆయనలో తీవ్రమైన మార్పు వచ్చింది. కాని లలితాదేవి మాత్రం మానసికంగా యెలాంటి మార్పు వచ్చినట్టు ప్రవర్తించనేలేదు. మామూలుగానే వుంటోంది. ఉదయం, సాయంత్రం పూట గురుస్వామి ఆశ్రమానికి వెళ్ళటం, పూజలు చేయటంకూడా అది వరకు మాదిరిగానే జరిగి పోతోంది. ఆమె గుండె నిబ్బరానికి ధైర్యానికి, నిరంజనరావు విల విలలాడి పోతున్నాడు. మొదటి రోజు కాబట్టి నిరంజన రావుకు అంతా కొత్తగానూ, బాధగానూ వుంది. తర్వాత తర్వాత లలితా దేవి గురుస్వామ దగ్గరే అనేకసార్లు వుండిపోయింది. అది అలవాటు క్రిందకు వచ్చేసింది. పరిస్థితులను ఆకళింపు చేసుకుని, హుందాగా ప్రవర్తించగల నేర్పు అయనలో మొదటి నుంచీ వుంది. అదే ఆయనకు రక్ష.

## 3

'బ్రహ్మం, నేను చేసిన పాపాలకు నిష్కృతిలేదు. ఇంత మంది

మాయకపు ప్రజలను మోసం చేసిన తర్వాత, నాకు యెంత కీర్తి వచ్చినా యెంత డబ్బు వచ్చినా నిష్ప్రయోజనమే...' తీవ్రంగా ఆయాస పడుతున్నాడు గురుస్వామి.

'నువ్వీమధ్య చాలా ఆందోళన పడుతున్నట్టు కనిపిస్తోంది. నీలో మార్పు, ప్రజలకూడా తెలిసిపోతోంది. ఇది చాలా ప్రమాదం ...' హెచ్చరించాడు బ్రహ్మం.

'ప్రమాదా లేమిటో అదివరకే జరిగిపోయినాయి. అంత కంటే యిక ముందు జరిగేవేమీ వుండవు ...'

'మనం యిల్లు వదిలిపెట్టి వచ్చింది ఇతరులను మోసగించటానికి కాదు, బ్రతుకు తెరువు చూసుకోవటానికి. ఆ ప్రయత్నంలో అనేకం చేశాము. చేయించాము. నేనూ మొదట్లో చాలా గాభరాపడ్డాను. నిజానికి చెప్పాలంటే నేను స్వతహాగా దుర్మార్గుడ్ని కాదు, నీకు తెలుసు ఆవిషయం. నాకు దొంగతనం నేర్పావు, రంకు తనం నేర్పావు. సునాయాసంగా హత్యలు చేయించావు. నాలో నీతినియమాలు లేకుండాచేశావు. నేను మానసికంగా యెంత బాధపడ్డానో,కృంగి కృశించానో నాకు తెలుసు. కాని తర్వాత తర్వాత నాలో నేను సమాధానపడ్డాను. నాకు అంత ధైర్యం, సాహసం యెట్లా వచ్చినాయో తలుచుకుంటే నాకే ఆశ్చర్యంగా వుంది. ఆనాడు గుప్పెడు మెతుకులు పెట్టని యీ లోకం, నన్ను హర్షించింది. ఆదరించింది. కాపాడింది. ఎందు వలన ? నేను చేసిన పనుల వలన. నేను మొద్దుబారిపోయాను. బండరాయి అయిపోయాను. ఇక నాకు దిగులు లేదు. కాని నువ్వు మారిపోవటం నాకు వింతగా వుంది ...' తన ఆవేదనను చెప్పుకున్నాడు బ్రహ్మం.

'నువ్వింత వరకు చేసిన పాపాలన్నింటికి నేనే బాధ్యుడ్ని. శిక్ష యేదైనా వుంటే నేనే అనుభవించాలి. పరలోకంలో కూడా నేను నరకం

పాలవుతాను. నీకేమీ అంటవు. ఇప్పుడు నాక్కావలసింది మనశ్శాంతి. పశ్చాత్తాపడే రోజు వచ్చింది. నేను అంత కంటే చేసేదేమీ కూడా లేదు. నేను నిరంజనరావుకు తీరని అన్యాయం చేశాను. మైకంలో పడిపోయి ఘోరమైన పాపాన్ని చేశాను. చేసిన తప్పులు చెప్పుకుంటే పోతాయి అంటారు. నేను నా నిజ స్వరూపాన్ని బైటపెట్టి, ప్రజల ముందర ధైర్యంగా నిలబడతాను. వారు ఎలాంటి శిక్షవేసినా నాకు యిష్టమే. ఈ బాధను భరించలేను. నా శరీరం దహించుకు పోతోంది. నాకేదైనా ఉపాయం చెప్పు ...' గురుస్వామికి ఉద్రేకం యెక్కువయి పోతోంది.

'ఎన్ని ఘోరాలు చేసినా. ఎంత మోసగించినా, ప్రజల్ని యెంత దోచుకున్నా, నువ్వు వాళ్ళకు మహోపకారం చేశావు. వాళ్ళ విశ్వాసానికి నువ్వు చిహ్నంగా నిలబడ్డావు. వాళ్ళకు భక్తితో పాటు మనశ్శాంతి కూడా ప్రసాదించావు. నిన్ను ప్రత్యక్ష దైవంగా కొలుస్తున్నారు. ఇప్పుడు చేసిన పాపాలుచాలు. ఇంకా వాళ్ళను సర్వనాశనం చేద్దామని ప్రయత్నం చెయ్యద్దు. వాళ్ళకు యీ మాత్రం శాంతినైనా మిగలనీ. నువ్వొక్కడివే యెంత బాధపడ్డా ఫరవాలేదు. నీమూలాన యీ ప్రజలకు యింకా యే విధమైన యిబ్బందులు కలిగించటం నాకు యిష్టంలేదు. నీ జీవితం యిట్లా వెళ్ళిపోవాల్సిందే. నువ్వు మళ్ళీ మారటానికి వీల్లేదు. నేకు ఒప్పుకోను...' నిక్కచ్చిగా చెప్పాడు బ్రహ్మం.

'నేనే స్వయంగా వెళ్ళి, నేను తత్వ వేత్తను కాదు, యోగిని కాదు, మానవ మాత్రుడ్ని. మిమ్మల్ని మోసగించాను. అపచారం చేశాను. నన్ను క్షమించమని వేడుకుంటాను. అప్పుడేమవుతుంది ...'

'గురుస్వామికి పిచ్చి యెక్కిందని అనుకుంటారు. ఎవ్వరూ నీ మాటలు నమ్మరు. ఒక వేళ వాళ్ళట్లా అనుకోక పోతే. నేను ప్రచారం చేస్తాను. నీకు పిచ్చియెక్కిందని. అప్పుడే మంటావు.'

'నువ్వు అంతపని చెయ్యగల సమర్థుడివే, నాకు తెలుసు ...'

'సందేహ మేమిటి, నువ్వు నాకు నేర్పిన విద్యలో యిది యెన్నో వంతు. నాకు కలిగిన విశ్వాసానికి, నాలో జీర్ణించుకు పోయిన సాహసానికి యిది యెన్నో వంతు. ఇవ్వాళ నేను యిక్కడ కూర్చోక పోతే నువ్వులేవు నీ అస్తిత్వం కేవలం నామీదే ఆధారపడి వుంది. నిన్ను యింత గొప్ప వాడ్ని చేసింది నేను. అహం అంటే నేను, నేనంటే బ్రహ్మాన్ని, అది గుర్తుంచుకో. నువ్వివ్వాళ యేమీ చెయ్యలేవు. నా అనుమతిలేందే ఒక్క అడుగు ముందుకు గాని, వెనక్కుగాని వెయ్యలేవు...' నిశ్చయంగా చెప్పేశాడు బ్రహ్మం.

'అది నేను కాదనటంలేదు. కాని నా కేదో మార్గం చూపించమని అడుగుతున్నా. అంతే. నేను యింకా యీ ముసుగు బ్రతుకులోనే వుండి పోలేను. నా మతి పోతోంది. ఇక్కడి నుంచి యెట్లాగైనా సరే బైటపడే మార్గం ఆలోచించు నాకేమీ తోచటం లేదు...'

'నేను అన్నీ ఆలోచించే వుంచాను. సమయం వచ్చినప్పుడు చెపుతాను. అంతవరకు ఓపికపట్టు...' అభయమిచ్చాడు బ్రహ్మం.

ఏమిటి బ్రహ్మం నువ్వనేది, నాతో చెప్పటాని కేమిటి ! ఎందుకు దాపరికం. నువ్వు చాలా వింతగానూ, తమాషాగాను మాట్లాడు తున్నావు. నా కర్థం కావటం లేదు. విడమర్చి చెప్పు ...' ప్రాధేయ పడ్డాడు గురుస్వామి

'అదుగో నిరంజనరావుగారు వస్తున్నారు. కొంప తీసి, మనింటికే వస్తున్నట్టున్నాడు...'

'ఆఁ ... అవును యిటువైపే వస్తున్నాడు. ఇవ్వాళ యెవ్వరినీ యిక్కడికి రావద్దనిచెప్పాము. మరి ఆయన వస్తున్నప్పుడు మనం వద్దనటమా యేమిటి! ....'

'నువ్వు గదిలో మామూలుగా కళ్ళుమూసుకుని ధ్యానంలోనే వుండు ఆయన సంగతి నేను చూసుకుంటా.'

నిరంజనరావు అక్కడికి రానేవచ్చాడు. బ్రహ్మానికి నమస్కారం చేశాడు. కుడిచేయి అరచేతిని. అతని తలమీద వుంచి ఆశీర్వదించాడు బ్రహ్మం. నిరంజనరావు తల పైకెత్తి, బ్రహ్మం మొహంలోకి చూశాడు. ఆయన వర్చస్సు, గాంభీర్యం బ్రహ్మాన్ని గడగడలాడించినాయి.

ఒక్కక్షణం తబ్బిబ్బయి అట్లాగే కళ్ళార్ప కండా చూస్తూవుండి పోయాడు.

'గురుస్వాముల వారిని కలవాలని వచ్చాను. అన్నాడు నిరంజన రావు.

'ఆ ... వారు లోపల నిష్ఠలో వున్నారు. ఇవ్వాళ యెవ్వరినీ కల వరు. అందుకనే భక్తుల నెవ్వర్ని కూడా యిటువైపు రావద్దన్నాం ...'

'నేను ఆయన భక్తుడ్ని ఎన్నటికి కాను. ఇప్పుడు ప్రశాంతంగా వుందని, ఆయన్ను తీరిగ్గా కలవచ్చని వచ్చాను. అంతే! ...'

'కావచ్చు కాని ఆయన్ను కలవటానికి యిది సమయం కాదని మనవి చేస్తున్నా ...'

'సమయా సమయాలు నాకు తెలుసు. ఎవరు ఏమిటో నాకు పూర్తిగా తెలుసు. నన్ను కేవలం అయాయకపు భక్తుడ్నిగా నెట్టెయ్యక్క ర్లేదు. నేను వారితో మాట్లాడ టానికే వచ్చాను. మాట్లాడి తీరుతాను. ఆయన మామూలు మనిషికాడు, అనన్య సామాన్యమైన వ్యక్తి. ఆయన గొప్పతనం నాకు తెలుసు. దగ్గరుండి ఆయన్ను అర్థం చేసుకోలేక పోయారు మీరు.నేను దూరానవుండి అంతా అవగాహన చేసుకున్నాను....' గంభీరంగా అంటున్నాడు నిరంజనరావు.

ఆయన మాట్లాడు తుంటే బ్రహ్మానికి మూర్ఛ వచ్చినంత పనయింది. ఏమీ అనలేక పోయాడు. తనవెంటే లోపలికి తీసుకు వెళ్ళాడు.

'నమస్కారము', అన్నాడు నిరంజనరావు.

'నన్ను క్షమించండి. అజ్ఞానంలో ఏవేమిటో అనుకున్నాను, నిందించాను, మానసికంగా బాధపడ్డాను, క్షోభపడ్డాను. ఒక సమయంలో ఆవేశం ఆవహించి, మిమ్మల్ని గురించి బాహాటంగా యేవో చెపుదామనుకున్నాను. కాని నా తప్పును నేను తెలుసు కున్నాను. పశ్చాత్తాప పడ్డాను. మిమ్మల్ని క్షమాపణ వేడుకోవటానికి వచ్చాను. మీరు దైవస్వరూపులు. అశేష ప్రజానీకానికి మళ్ళా ఆస్తికత్వం మీద నమ్మకం కుదిర్చారు విశ్వాసానికి మించినది మరొకటి లేదు. ప్రజలలో పాప భీతిని కలుగ చేశారు. ఇంత గొప్ప పనిని ప్రతివ్యక్తి చెయ్యలేడు. ఏదో దైవ ప్రేరణ వుండ బట్టే యిలాంటి మంచిపని చెయ్యకలిగారు, అంత కంటె ముఖ్యమైనది, నా భార్య లలితాదేవికి అచంచల విశ్వాసాన్ని కలుగ చేశారు. దానికి నేను కృతజ్ఞత చెప్పు కోవటానికే యీనాడు మీ దగ్గరకు వచ్చాను. వస్తాను ...' నిరంజనరావు లేచి నిలబడ్డాడు.

గురుస్వామి కూడా అప్రయత్నంగా లేచాడు. బ్రహ్మం నోట మాటలేదు. నిరంజనరావు వెనక్కి తిరిగి, సూటిగా తనింటికి వెళ్ళిపోయాడు.

గురుస్వామి కొద్ది క్షణాలు కొయ్యబారి నిలబడి పోయాడు.

'విన్నావా ఆయన మాటలు. సరిగ్గా నేను అన్నముక్కలే ఆయన అన్నాడు. నిజం అంతే ...'

'ఆఁ ...' కళ్ళార్పుతూ మళ్ళీ యీ లోకంలోకి వచ్చాడు గురుస్వామి.

'అయితే యేం చెయ్యమంటావు. ఇప్పుడు నే నేమిచెయ్యాలి. నా కంఠానికి చుట్టూ ఎవరో తాడు బిగిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఉక్కిరి

బిక్కిరిగా వుంది. నా కేమీ కోచటం లేదు. నిరంజనరావు మాటలను బట్టి ఆయనకు మన విషయాలు తెలిసినట్లుగా కనపడు తోంది ...' తీవ్రంగా రొప్పుతూ, ఆవేదన పడుతున్నాడు గురుస్వామి.

'ఆయనకు అన్నీ తెలిసే హెచ్చరిక చెయ్యటానికి వచ్చాడు. పైకి మాత్రం కృతజ్ఞత చెప్పుకోవటానికి వచ్చానన్నాడు కాని ...'

'కృతజ్ఞత ...' దేనికి అని నోట్లోనే అనుకున్నాడు గురుస్వామి.

'ఏం బ్రహ్మం! అట్లా చూస్తావు. ఇప్పుడు మనం చెయ్యవలసిన కర్తవ్యం ఏమిటి?...'

'అన్నీ చెపుతాను. రేపు శివరాత్రి...'

'అయితే!...'

'తొందరపడితే యెట్లా. ప్లానంతా వేసే వుంచాను...'

'ఏమిటి. నన్ను చిత్రవధ చెయ్యక చెప్పేదేమిటో సూటిగా చెప్పు...'

'ఈ ఒక్కరాత్రి ఓపికపట్టు. తెల్లవారితే అంతా నీకే తెలుస్తుంది. నలుగురూ వస్తారు. వాళ్ళముందరే చెపుతాను. నీ మానసిక సంక్షోభం తీసివేసే ఉపాయం ఆలోచించాను...' గంభీరంగానూ నిబ్బరంగానూ అన్నాడు బ్రహ్మం.

'నువ్వింతగా మారిపోతావని అనుకోలేదు. నా ముందరే అట్లా మాట్లాడుతున్నావు. ఏమి టా రహస్యం. నాతో చెప్పక పోవటానికి కారణం యేమిటి? ఏం చెయ్యదలచుకున్నావు...' నిలవేసి అడుగు తున్నాడు గురుస్వామి.

బ్రహ్మం మాత్రం చలించలేదు. సమాధానం చెప్పటం లేదు. గురు

స్వామికి ఎటూ తోచటం లేదు. బ్రహ్మంతో గట్టిగా మాట్లాడి నిర్వహించు కునేటట్టు కనబడలేదు. బ్రహ్మం చేతిలో ఖైదీ అయిపోయానే అని వాపో తున్నాడు.

గురుస్వామికి ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు. గదిలో అటూయిటూ పచార్లు చేస్తూనే వున్నాడు. ఆ గదిలోంచి బైటకు వెళ్ళటానికికూడా వీలు పడలేదు. ఎవరైనా చూస్తారేమోన్న భయం ఒకవైపు బాధిస్తోంది. మరొక వైపు బ్రహ్మం ఏదో ఉపాయం ఆలోచించానని, యీ బాధలనుంచి తప్పించుకో వచ్చని అంటున్నాడు. అది యేమయి వుంటుందా అనే ఆరాటం. భళ్లున తెల్లారింది.

ఇక మామూలుగా జనం వచ్చేస్తున్నారు. బ్రహ్మం లోపలికి వెళ్ళి గురుస్వామిని తీసుకు వచ్చాడు. ఆయన వేదికమీద కూర్చున్నాడు. ప్రజ లందరు భక్తి శ్రద్ధలతో చేతులు జోడించారు. రోజూ మాదిరి ఆయన అభయ హస్తం చూపించటం మరిచేపోయాడు. బ్రహ్మం సంజ్ఞ చేశాడు. గురుస్వామి బిత్తర చూపులతో తత్తరపడి పోతున్నాడు. బ్రహ్మం ఇక ప్రారంభించాడు.

'తల్లులారా, తండ్రులారా! మీరు ఇన్నాళ్ళుగా గురుస్వాములవారిని సేవించి మీ భక్తిశ్రద్ధలను ప్రదర్శించారు. మేము మీకు ఏమాత్రం సేవ చేయకలిగినా, అది ఈశ్వరేచ్ఛేయని భావిస్తున్నాము. మేము మానవ మాత్రులము. అంటే మనము...మానవ మాత్రులము - గురుస్వాముల వారి స్థాయికి రావటం. అంత పరిపక్వదశ పొందటం యీ జన్మలో సాధ్యం కాదు. వారినే నమ్ముకుంటూ, వారి అడుగుజాడలలోనే నడు స్తున్నాం. వారి ఆశీర్వాదం పొందుతున్నాం. కాని రేపటినుంచి ఈ భౌతిక కాయంతో వారు మనకు కనపడరు. ఈ రాత్రి పన్నెండు గంటలకు గురుస్వాములవారు శివైక్యం పొందుతున్నారు. ఈ విషయం మీ అంద

రికి చెప్పమని వారి ఆజ్ఞ...' అంటూ కళ్ళు తుడుచుకున్నాడు బ్రహ్మం.

ప్రజల్లో కలవరం, ఆందోళన బయలుదేరినాయి.

"అయితే స్వాములవారు యిక మనకు కనపడరా..." చాలా మంది కన్నీళ్ళు కార్చారు.

వేదికమీద కూర్చున్న గురుస్వామికి తల గిర్రున తిరుగుతోంది. ఇది కలా! నిజమా! బ్రహ్మం ఎందుకిట్లా అంటున్నాడు. ఏం జరగబోతోంది! ఇంత దారుణానికి కూడా తయారవుతాడా! ఇప్పుడు చెయ్యాల్సిందేమిటి! ఇవన్నీ గురుస్వామిని గాభరా పెట్టేస్తున్నాయి. ఇంకా యేదో బ్రహ్మం చెప్తూనే వున్నాడు. భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు యిస్తూనే వున్నాడు. కాని అవేమీ వినిపించటం లేదు. ఆ క్షణానే గుండె ఆగినంత పనయింది.

"ఇప్పుడు స్వాములవారు లోపలికి వెళ్ళి తపస్సులో వుంటారు...' అన్నాడు బ్రహ్మం.

గభాలున వేదికమీదినుంచి లేచి, గురుస్వామి తొట్రుపాటుగా లోపలికి వెళ్ళాడు. వచ్చిన వాళ్ళందర్నీ సాగనంపి బ్రహ్మం లోపల ప్రవేశించాడు.

"బ్రహ్మం...ఏమిటి నీ ఉద్దేశం..."

"నే చెప్పాగా, అందరి ముందరే చెప్పాను. దీంట్లో రహస్యం యేముంది..." ఆయన వైపు తిరిగి చూడలేదు బ్రహ్మం.

"అయితే నువ్వు నన్నుకూడ హత్య చేస్తావన్నమాట..." రౌద్రంగా అన్నాడు గురుస్వామి.

"నా కెందుకు ఆ శ్రమ...."

"నీక్కావాలంటే, ఆ బంగారం, ఆ డబ్బు నువ్వే తీసుకుపో. నాకేమీ అక్కర్లేదు..."

"డబ్బుకోసం నేను యీ పనిచేస్తున్నా ననుకుంటే, నువ్వు చాలా పొరపాటు పడ్డావు. నాకు కావాలంటే యీనాడు రెండింతలు డబ్బు వస్తుంది. ఇదొక లెక్కకాదు..."

"మరి దేనికి...."

"అదివరకే చెప్పాగా! ఇంకా ప్రజల్ని యే మాత్రం హింసించటం నేను చూడలేను. వాళ్ళకు విముక్తి అంటూ వుండాలి. ఇన్నాళ్లు ఓపికపట్టి వూరుకున్నాను. నీలో తీవ్రమైన మార్పు వచ్చింది. చేసిన పాపాలకు పశ్చాత్తాప పడాలనే కోరిక కలగటమే వాళ్ళను యింకా దోచుకోవటానికి అవకాశం యిస్తుంది. వాళ్ళ విశ్వాసాన్ని, భక్తిని, శ్రద్ధను పాడుచెయ్యటం నాకేమాత్రం యిష్టంలేదు. ఈ అర్ధరాత్రి నువ్వు శివైక్యం పొందాల్సిందే ...ఇది తప్పదు...'

గురుస్వామి నిర్విణ్ణుడయి పోయాడు.

'ఇంతకాలం యిన్ని పనులు చేసింది దేనికోసం, ఎవరికోసం!...' గట్టిగా అరిచాడు గురుస్వామి.

'ప్రజలకోసం!....వాళ్ళకు నమ్మకం కుదిర్చావు. నువ్వు వచ్చిన పని అయిపోయింది. అంతే!...'

'ఆఁ!... జ్ఞాను వచ్చింది అందుకా!...'

'వచ్చింది దేనికైనాగాని, చివరికి పర్యవసానం యిట్లా వచ్చింది. దానికి మనమెవ్వరం బాధ్యులం కాము....'

'నాకీ శిక్ష యెందుకో అర్థం కావటం లేదు.'

'ఇది శిక్షకాదు నీకు విముక్తి. నువ్వు క్షోభపడుతూ ప్రతిక్షణం క్రుంగి పోతున్నావు. ఇది నేను చూసి భరించలేను. నువ్వు యిముడ్చుకో లేవు...'

'కాదు కాదు, నేను సమాధానపడతాను. చేసినవన్నీ తప్పులని బాధపడను. ఇట్లాగే గడుపుదాం...'

'గడువుకూడా దాటిపోయింది. అందరి ముందు బాహాటంగా చెప్పే శాను. ఈ రాత్రి అది జరగకపోతే, మళ్ళీ ప్రజల్లో విశ్వాసం నడలి పోతుంది. ఇది మాత్రం జరగకూడదు.'

'అయితే!...'

అర్ధరాత్రి ఆత్మహత్య. సునాయాసంగా పోయే ఏర్పాటు నేను చేశాను. ఇదిగో మందు గుప్పెట్లో సీసా చూపించాడు.

'ఆత్మహత్య! ఆత్మహత్య ఘోరపాపం!... గురుస్వామికి ముచ్చెమట్లు పోసినాయి.

'మనం చేసిన పాపాల్లో యిదెన్నో వంతు!...' బ్రహ్మం గుప్పిట మూసేశాడు. ఇదే ఆయనకు సమాధానం. అంతే!

అంతా గాఢంగా నిద్రపోయే సమయం. కాని ఆనాడు శివరాత్రి అవటంవలన యిళ్ళల్లో దీపాలు వెలుగుతూనే వున్నాయి. గురుస్వామి ఆశ్రమంచుట్టూ అనేకమంది జనం గుమిగూడి వున్నారు.

గుళ్ళో గంటలు గణగణ మోగుతున్నాయి. శివశివ అనే మాటలు ప్రతినోటా వినబడుతున్నాయి. జనం ఆదుర్దాగా అటూ యిటూ అలసటగా తిరుగుతున్నారు. అందరి కళ్ళూ గురుస్వాములవారి గదిమీదే కేంద్రీకరింప బడినాయి. దేనికోసమో వేచివున్నట్లు నిరీక్షిస్తున్నట్లు ఆదుర్దాగా నోళ్లు సగం తెరుచుకుని, కళ్ళు బాగా తెరుచుకుని, నిశ్చలంగా చూస్తున్నారు.

నిద్రమత్తు వదుల్చుకుని, బలంగా గంటలు కొడుతున్నారు ఎక్కడో. అందరూ ఒకటీ రెండూ అంటూ, పన్నెండు గంటలు లెక్కపెడుతున్నారు. పన్నెండు అయింది అని నిట్టూర్చారు. అమాంతం తలుపులు తెరుచుకొని, గాభరాగా బ్రహ్మం బైటకు వచ్చేశాడు. కాళ్లూ చేతులు గజగజ లాడుతున్నాయి.

'మహాజనులారా! గురుస్వాములవారు శివైక్యం పొందారు...' గుక్కతిప్పుకోకుండా అనేసి, అక్కడే కూలబడి పోయాడు బ్రహ్మం.

దూరాన్నుంచి యిద్దరు లాంతర్లు పట్టుకుని హడావిడిగా వచ్చారు. ఇక్కడ జనాన్నిచూసి విస్తుపోయారు.

'స్వాములవా రెక్కడ. అమ్మగారికి మగపిల్లాడు కలిగాడు...' ఆవేశంగా అన్నారు.

'లలితాదేవిగారికా!' అందరూ సంతృప్తిగా నిట్టూర్చారు.

****